క్లుప్తంగా

నేడు ప్రజా ఆశీర్వాదయాత్ర

మండవల్లి: మండలంలోని పులపర్రు, చింతపాడు, దెయ్యంపాడు గ్రామాల్లో ఆదివారం 14వ రోజు ప్రజా ఆశీర్వాదయాత్ర జరుగుతుందని ఎంపీపీ పెద్దిరెడ్డి శ్రీరామదుర్గాప్రసాద్(రాము) శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్), ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ, ఏలూరు ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్ కుమార్ యాదవ్ ఈ యాత్రలో పాల్గొంటారని పేర్కొన్నారు.

ఆరోగ్యశ్రీ కార్డులు సత్వరమే పంపిణీ చేయాలి

ముదినేపల్లి రూరల్: మండలంలోని అన్ని గ్రామాల్లో ఆరోగ్యశ్రీ కార్డులు వెంటనే పంపిణీ చేసేందుకు సచివాలయాల సిబ్బంది, వైద్య సిబ్బంది కృషి చేయాలని ఇన్‌చార్జి ఎంపీడీఓ కె రమణబాబు, ఈఓపీఆర్డీ దూలం లక్ష్మీనారాయణ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని గ్రేడ్–5 కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, పీహెచ్‌సీల సూపర్‌వైజర్లు, వైద్య సిబ్బందితో శనివారం సమావేశాన్ని నిర్వహించారు. మండల పరిషత్ కార్యాలయ జూనియర్ అసిస్టెంట్ ఎంవీ సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

శివరాత్రి ఏర్పాట్లపై సమీక్ష

తోట్లవల్లూరు: ఈ నెల 8న జరగనున్న శివరాత్రి ఉత్సవాల విజయవంతానికి అధికారులు సమష్టిగా పనిచేయాలని తహసీల్దార్ ఎం. కుసుమకుమారి సూచించారు. స్థానిక శ్రీభ్రమరాంబ చెన్నమల్లికార్జునస్వామి ఆలయంలో శివరాత్రి ఏర్పాట్లపై శనివారం సమీక్ష సమావేశం జరిగింది. పుణ్యస్నానాల కోసం వచ్చే భక్తులకు అవసరమైన ఏర్పాట్లు చేయడంతో పాటు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని కుసుమకుమారి ఆదేశించారు. ఎస్ఐ పి.విశ్వనాథ్, సెబ్ ఎస్ఐ దుర్గాప్రసాద్, ఆలయ ఈఓ హరి దుర్గా నాగేశ్వరరావు, గుమ్మస్తా శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

పమిడిముక్కల: కృష్ణాపురం శివారు నారాయణపురం గ్రామానికి చెందిన తెనాలి చింతయ్య(24) రోడ్డు ప్రమాదంలో ఇటీవల మృతి చెందారు. మట్టి ఖర్చుల నిమిత్తం రూ.5 వేలు గ్రామానికి చెందిన ఎన్ఆర్ఐ కూచిభొట్ల కిరణ్ కుమార్ అందజేశారు. ఈ ఆర్థిక సాయాన్ని మృతుడి తల్లి నాగమణికి శనివారం రాష్ట్ర రెడ్డిక కార్పొరేషన్ డైరెక్టర్ కంభపు రాంబాబు, నాయకులు గజాల అందజేశారు.

పేకాట శిబిరంపై దాడి

పమిడిముక్కల: మండలంలోని కూడేరు గ్రామంలో పకాట శిబిరంపై శనివారం పోలీసులు దాడి చేశారు. నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.2,090 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ కుడిపూడి శ్రీనివాస్ తెలిపారు. కేసు నమోదు చేసి నిందితులను కోర్టులో హాజరుపర్చనున్నట్లు పేర్కొన్నారు.

పచ్చదనం-పరిరక్షణపై అవగాహన

గుడివాడ టౌన్: విద్యార్థులకు పచ్చదనం–పరిశుభ్రత, పర్యావరణం–పరిరక్షణ వంటి వాటిపై అవగాహనతో పాటు వాటి అవసరాన్ని కూడా వివరించాలని ఆంధ్రప్రదేశ్ నేషనల్‌గ్రీన్ కార్ప్ డైరెక్టర్ పి.స్రవంతి అన్నారు. ఎకో క్లబ్ నిర్వాహణల పరిశీలనలో భాగంగా పట్టణంలోని విద్యావికాస్, ఫాదర్ బియాంకి హైస్కూల్ తదితర పాఠశాలల్లో గ్రీనరీ అవేర్‌నెస్ కార్యక్రమాల్లో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాఠశాల ప్రాంగణంలో పచ్చని చెట్లు, ఆహ్లాదకర వాతావరణం విద్యార్థులను చదువుపట్ల ఆకర్షితులను చేస్తుందన్నారు. తద్వారా పర్యావరణ పరిరక్షణకూడా జరుగుతుందన్నారు. కేవలం ప్రభుత్వ పాఠశాలలే కాకుండా ప్రైవేట్ విద్యాసంస్థలు కూడా ఈ విధానాన్ని అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో ఫాదర్ బియాంకి, హెచ్ఎం ఆర్‌సీ అంజలి, విద్యావికాస్ కో–ఆర్డినేటర్ కె.అన్నపూర్ణ, డైరెక్టర్లు ముప్పాళ్ల సుబ్బారావు, కొమ్మినేని సాంబశివరావు పాల్గొన్నారు.

పల్స్‌పోలియోను విజయవంతం చేయాలి



గుడివాడలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యబృందం



పెదపూడిలో ర్యాలీ చేస్తున్న ఆరోగ్య సిబ్బంది, విద్యార్థులు

పెదపూడి(మొవ్వ): మొవ్వ మండలంలో ఆదివారం పల్స్ పోలియో కార్యక్రమాన్ని నిర్వహించనున్న నేపథ్యంలో మొవ్వ, నిడుమోలు పీహెచ్‌సీల పరిధిలోని గ్రామాల్లో పోలియో చుక్కల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైద్యాధికారి డాక్టర్ సీహెచ్ రాజేశ్వరి పిలుపు నిచ్చారు. డాక్టర్ రాజేశ్వరి అయుష్ డాక్టర్ ఎం.భగవాన్‌తో కలిసి శనివారం మొవ్వ మండలం పెదపూడి గ్రామంలో ఎంపీయూపీ విద్యార్థులతో కలిసి అవగాహన ర్యాలీ కూచిపూడి రోటరీ క్లబ్ సభ్యులతో కలిసి నిర్వహించారు. మండలంలో 2 బస్టాండుల్లో, 1 మొబైల్ టీమ్ మండలంలో పర్యటించి నూరు శాతం పోలియో చుక్కలు వేసేందుకు ప్రణాళిక రూపొందించినట్లు ఆమె వివరించారు.

గుడివాడలో..

గుడివాడ టౌన్: పోలియో చుక్కలు వేసి చిన్నారులను అంగవైకల్యానికి దూరంగా ఉంచుదామని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి ఆర్ఎంఓ కృష్ణదొర అన్నారు. శనివారం స్థానిక ఏజీకే హైస్కూల్ నుంచి పట్టణంలో పోలియో చుక్కల ప్రాధాన్యతను తెలియజేస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ పట్టణంలోని బస్టాండ్, రైల్వే స్టేషన్‌తో పాటు ఐదు మొబైల్ పోలియో కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. అన్ని పోలింగ్ బూత్‌ల వద్ద, అర్బన్ హెల్త్ సెంటర్లు, సచివాలయాల వద్ద పోలియో చుక్కలు వేసేందుకు వైద్యులు, సిబ్బంది, ఆశావర్కర్లు, మొత్తం 240 మంది అందుబాటులో ఉంటారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జి. బాలసుబ్రహ్మణ్యం, పీపీ యూనిట్ ఇన్‌చార్జ్ డాక్టర్ సుదర్శనరావు, ఏరియా ఆస్పత్రి వైద్యులు డాక్టర్ అనురాధ, డాక్టర్ తేజస్విని, డాక్టర్ కెజియా రాణి, డాక్టర్ డేవిడ్ ట్విన్సన్, డాక్టర్ సుష్మా భారతి, డాక్టర్ యోగానందరావు పాల్గొన్నారు.

కలిదిండిలో..

కలిదిండి: మండలంలో ఆదివారం చేపట్టనున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీఓ దినతేజ్ కోరారు. కలిదిండి మండలంలో ఐదేళ్లలోపు పిల్లలు 5,077 మంది ఉన్నారని, వారికి పోలియో చుక్కలు వేసేందుకు 55 కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

తోట్లవల్లూరులో..

తోట్లవల్లూరు: పోలియోరహిత సమాజమే ప్రభుత్వ లక్ష్యమని తోట్లవల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు డాక్టర్ మాధవి పేర్కొన్నారు. ఆదివారం జరగనున్న పల్స్‌పోలియో కార్యక్రమం విజయవంతాన్ని కాంక్షిస్తూ తోట్లవల్లూరులో ఆరోగ్య సిబ్బంది శనివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. సీహెచ్ఓ కోటేశ్వరమ్మ, ఎంపీహెచ్ఈఓ మాణిక్యం, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.


తోట్లవల్లూరులో ర్యాలీ నిర్వహిస్తున్న ఆరోగ్య సిబ్బంది

పమిడిముక్కలలో..

పమిడిముక్కల: పల్స్‌పోలియో కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వైద్యులు మమత కోరారు. కపిలేశ్వరపురం గ్రామంలో స్థానిక పీహెచ్‌సీ సిబ్బంది పల్స్‌పోలియోపై శనివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యులు బాలాజీ, హెల్త్ సూపర్‌వైజర్ బొల్లా వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

వెంట్రప్రగడలో..

వెంట్రప్రగడ (పెదపారుపూడి): మండలంలోని వెంట్రప్రగడ పీహెచ్‌సీ పరిధిలోని గ్రామాల్లో ఆదివారం చిన్నారులకు పల్స్ పోలియో చుక్కలు వేయనున్నట్లు పీహెచ్‌సీ వైద్యులు సందీప్ పేర్కొన్నారు. వెంట్రప్రగడ గ్రామంలో శనివారం పల్స్ పోలియోపై అవగహన ర్యాలీ నిర్వహించారు.

సమస్యలు ఆలకిస్తూ.. పరిష్కరిస్తూ..

రెండోరోజుకు 'గుడ్ మార్నింగ్ కైకలూరు'

కైకలూరు: గుడ్ మార్నింగ్ కైకలూరు పేరుతో ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) చేపట్టిన కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తోంది. రెండో రోజు శనివారం ఎస్టీ కాలనీ ఏరియాలో ఎమ్మెల్యే డీఎన్నార్ పర్యటించి, ఇంటింటికీ వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సీతమ్మ అనే మహిళ తనకు పింఛను రాలేదని, ఆన్‌లైన్‌లో పేరు కనిపిస్తున్నా అందించలేదని ఎమ్మెల్యేకు చెప్పారు. ఆయన వెంటనే వలంటీరును పిలిచి సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. ఇటువంటి వారి పేర్లు తనకు ఇవ్వాలని చెప్పారు. మురాల లక్ష్మీ అనే మహిళ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా వచ్చిన తర్వాత 'మా కుటుంబం పరిస్థితిలో ఎంతో మార్పు వచ్చింది' అని చెప్పింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీలు చూడకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను అందిస్తున్నామన్నారు. రానున్న ఎన్నికల్లో అఖండ మెజారిటీతో వైఎస్సార్‌సీపీకి విజయాన్ని అందించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ అడవి కృష్ణ, జెడ్పీటీసీ సభ్యురాలు కురేళ్ల బేబీ, సర్పంచ్ దానం మేరీ నవరత్నకుమారి, వైస్ ఎంపీపీ మహమ్మద్ జహీర్, ఏలూరు జిల్లా వైఎస్సార్ సీపీ సేవాదళ్ అధ్యక్షుడు బలే నాగరాజు పాల్గొన్నారు.

మంచి చేశాం కాబట్టే ఓట్లడుగుతున్నాం

కైకలూరు: ప్రజలకు మంచి చేశాం కాబట్టే తిరిగి ఓటు అడుగుతున్నామని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) అన్నారు. ఆటపాక గ్రామంలో ప్రజాఆశీర్వాద యాత్ర పేరుతో చేపడుతున్న ఎన్నికల ప్రచారం శనివారం 13వ రోజుకు చేరింది. గ్రామంలో ఇంటింటికీ ప్రభుత్వ పథకాలను ఎమ్మెల్యే ప్రజలకు వివరించారు. అనంతరం ఆటపాక గ్రామంలో కలిదిండి భోగేశ్వరస్వామి ఆలయంలో శివరాత్రి వేడుకల పోస్టర్‌ను ఈవో శింగనపల్లి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఆవిష్కరించారు.


చిన్నారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డీఎన్నార్

అభివృద్ధి పనుల ప్రారంభం

నియోజకవర్గంలో ప్రతి గ్రామంలోనూ అభివృద్ధి కార్యక్రమాలు పెద్ద ఎత్తున జరిగాయని ఎమ్మెల్యే డీఎన్నార్ చెప్పారు. ఆటపాక గ్రామంలో రూ.30లక్షలతో సీసీ రోడ్డు, రూ.12లక్షలతో మరో సీసీ రోడ్డు, రూ.5 లక్షలతో డ్రెయిన్లను ఎమ్మెల్యే ప్రారంభించారు.

రుద్రభూమి ప్రారంభం

కైకలూరు: ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) రూపకర్తగా ఎకరం 20 సెంట్లలో వైఎస్సార్ నగర్ శివారున రూ.3.2 కోట్ల ప్రజా విరాళాలతో రుద్రభూమి పేరుతో శ్మశానవాటికను ఎమ్మెల్యే డీఎన్నార్, ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణతో కలసి శనివారం ప్రారంభించారు. అనంతరం జరిగిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ జనన మరణాలు అనేవి అందరి విషయంలో ఒక్కటేనని, రుద్రభూమికి వచ్చిన మృతుల బంధువులు చక్కటి వాతావరణంలో సాగనంపుతున్నామనే ఆలోచన వస్తోందన్నారు. ఎమ్మెల్సీ జయమంగళ వెంకట రమణ మాట్లాడుతూ కొల్లేటికోటలో అతిపెద్ద అనివేటి మండపం, భోగేశ్వరలంకలో స్వాగతద్వారం, కైకలూరులో రుద్రభూమి వంటి అనేక కార్యక్రమాలను దాతల సాయం, సొంత నిధులతో ఎమ్మెల్యే డీఎన్నార్, ఆయన కుమారులు వినయ్, శ్యామ్‌లు నిర్మించారన్నారు. అనంతరం రుద్రభూమికి విరాళాలు అందించిన దాతలను సన్మానించారు. కైకలూరు, కలిదిండి ఎంపీపీలు అడవి కృష్ణ, చందన ఉమామహేశ్వరరావు, జెడ్పీటీసీ కురేళ్ళ బేబీ, సర్పంచ్ దానం మేరీ నవరత్నకుమారి, కలిదిండి ఏఎంసీ చైర్మన్ కొల్లాటి సత్యనారాయణ, కొండ్రెడ్డి చినబాబు, క్షత్రియ సంఘ అధ్యక్షుడు రామరాజు, సయ్యపురాజు గుర్రాజు, ఎంపీటీసీ మంగినేని రామకృష్ణ, రుద్రభూమి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


రుద్రభూమిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్, ఎమ్మెల్సీ జయమంగళ

నూతన పాలక వర్గాల ప్రమాణ స్వీకారం

గుడివాడ టౌన్: స్థానిక పాటి మీద వేంచేసియున్న శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దేవస్థానం, శ్రీ గౌరీశం కరపురంలోని శ్రీ గౌరీ శంకరస్వామి వారి దేవస్థానం(చిన్న శివాలయం) నూతన పాలక వర్గం ప్రమాణ స్వీకారాలు శనివారం ఘనంగా జరిగాయి. గుడివాడ ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) సమక్షంలో ఆలయ తనిఖీ అధికారి ఉయ్యూరు సుధాకర్ పాలక వర్గ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. వేంకటేశ్వరస్వామి దేవస్థానం పాలక వర్గ అధ్యక్షుడిగా దొక్కు రాంబాబు, కార్యవర్గ సభ్యులుగా వంగపండు బ్రహ్మేశ్వరరావు(బ్రహ్మాజీ), గుమ్మడి నాగేంద్ర, దొండపాటి కృష్ణారావు, అంకెం ధనలక్ష్మి, మామిళ్లపల్లి రమ్యారెడ్డి, తాడిపత్రి సునీత, వేదాంతం అప్పలాచార్యులు, శ్రీ గౌరీ శంకరస్వామి దేవస్థానం పాలక మండలి అధ్యక్షుడిగా డాక్టర్ బండారు శ్యామ్‌కుమార్, పాలక మండలి సభ్యులుగా నారం నరేష్, వరుపుల బాలకృష్ణమూర్తి, మూడెడ్ల ఉమ, రావులకొల్లు హైమావతి, కంభ్రకొండ వెంకటలక్ష్మి, కొండపల్లి వెంకట నారాయణరెడ్డి, లంక గిరిచంద్ర ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మండలి హనుమంతరావు, అధికార ప్రతినిధి ఎంవీ నారాయణరెడ్డి, పట్టణ అధ్యక్షుడు గొర్ల శ్రీను, సీనియర్ నాయకులు దుక్కిపాటి శశిభూషన్, చందరాల హరిరాంబాబు, పాలేటి చంటి, పాలడుగు రామ్‌ప్రసాద్, మెరుగుమాల కాళీ, అల్లం రామ్మోహన్, మున్సిపల్ మాజీ కౌన్సిలర్లు మాదాసు వెంకటలక్ష్మీకుమారి, జోగా సూర్య ప్రకాశరావు, బొజ్జగాని కోటమ్మ పాల్గొన్నారు.


వేంకటేశ్వర స్వామి వారి దేవస్థానం నూతన పాలకవర్గం


శ్రీ గౌరీ శంకరస్వామి వారి దేవస్థానం నూతన పాలకవర్గంతో ఎమ్మెల్యే కొడాలి నాని

చంద్రబాబు ఆలయాలు కూలిస్తే సీఎం జగన్ కట్టించారు

– ఎమ్మెల్యే కొడాలి నాని

గుడివాడ టౌన్: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం హిందూమతానికి వ్యతిరేకమనే ప్రతిపక్షాల వాదన పూర్తిగా అబద్ధమని గుడివాడ ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు (నాని) అన్నారు. శనివారం స్థానిక శ్రీ వేంకటేశ్వరస్వామి వారి దేవస్థానంలో నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకార సభలో ఆయన మాట్లాడారు. ప్రతిపక్షాలు పూర్తి అబద్ధ ప్రచారాలు చేస్తున్నాయన్నారు. పుష్కరాల సమయంలో విజయవాడ పరిసర ప్రాంతాల్లో చంద్రబాబు నాయుడు 40 దేవాలయాలు కూల్చి దేవతల విగ్రహాలను మున్సిపల్ ట్రక్కుల్లో తరలించారన్నారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక తిరిగి వాటిని సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నిర్మించి హిందువుల మనోభావాలను దెబ్బతినకుండా చూశారన్నారు. సాధారణంగా ఆలయానికి వచ్చిన కానుకలతో ఆలయాభివృద్ధి పనులు చేస్తారని జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో విజయవాడ కనకదుర్గ అమ్మవారి దేవస్థానం అభివృద్ధికి రూ.75 కోట్లు ప్రభుత్వ నిధులు మంజూరుచేసి అధునాతన వసతులు ఏర్పాటు చేశారన్నారు. పట్టణంలోని శ్రీ భీమేశ్వస్వామి వారి దేవస్థానం అభివృద్ధికి రూ.2 కోట్లు, జనార్ధనపురం శివాలయం అభివృద్ధికి, పలు దేవాలయాల అభివృద్ధులకు కోట్లాది రూపాయలు ప్రభుత్వ నిధులు ఖర్చు చేసిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ఎన్నికల సమయంలో ప్రతిపక్షాలు దుర్మార్గపు ప్రచారాలు చేస్తున్నాయని ప్రజలు వాటిని నమ్మవద్దని ఆయన కోరారు.

దేవుని ఆశీస్సులతో ప్రజలు సుభిక్షంగా ఉండాలి

ఎమ్మెల్యే కొడాలి నాని

నందివాడ: దేవదేవుడైన ఏసుక్రీస్తు ఆశీస్సులతో నియోజక వర్గ ప్రజలు సుభిక్షంగా ఉండాలని కోరుకుంటున్నట్లు ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు (నాని) అన్నారు. శనివారం నందివాడ మండలం పోలుకొండ గ్రామంలో సీఎస్ఐ చర్చ్ 9వ వార్షికోత్సవ ప్రార్థనలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు సుఖశాంతితో ఉండాలని, సుభిక్షంగా జీవించాలని తాను కోరుకుంటున్నానన్నారు. అనంతరం చర్చి పాస్టర్లు ఆశీస్సులు తీసుకున్నారు. కార్యక్రమంలో పాస్టర్ ఎలీషారావు, ఎంపీపీ పెయ్యల ఆదాం, చర్చ్ పెద్దలు పిట్టా ప్రసన్న, వల్లి లోకేశ్వరరావు, మానేపల్లి నాగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు తోట నాగరాజు, కందుల నాగరాజు పాల్గొన్నారు.


పాస్టర్ల ఆశీస్సులు అందుకుంటున్న ఎమ్మెల్యే కొడాలి నాని

టీడీపీకి ఆబూ గుడ్‌బై

గుడివాడ టౌన్: ముస్లిం నాయకుడు, టీడీపీ క్రియాశీల నాయకుడు మహ్మద్ ఖాసీం(ఆబూ) తెలుగుదేశం పార్టీకి గుడ్‌బై చెప్పారు. శనివారం ఆయన విలేకరుల సమావేశంలో తన నిర్ణయాన్ని ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏళ్ల తరబడి పార్టీకి, పార్టీ అభివృద్ధికి కష్టపడినా పార్టీలో గుర్తింపులేని కారణంగా తాను రాజీనామా చేస్తున్నానన్నారు. ముస్లిం మైనార్టీల అత్యధిక భాగం నివసించే 10, 11, 12 వార్డులలో తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు కలిగిన ఆబూ గత మున్సిపల్ ఎన్నికల్లో పట్టణంలో వైఎస్సార్ సీపీ అభ్యర్థులు గెలిచి పాలకవర్గం కైవసం చేసుకున్న సమయంలో సైతం ఆబూ తన భార్యను 10వ వార్డు కౌన్సిలర్‌గా గెలిపించి తన సత్తా చాటుకున్నారు. ముస్లిం సామాజిక వర్గంలో మంచి పలుకుబడి కలిగిన ఆబూ టీడీపీని వీడటం ఆ పార్టీకి పట్టణంలోని ముస్లింలు పూర్తిగా దూరమైనట్లేనని స్థానికులు చర్చించుకుంటున్నారు. ఆదివారం సాయంత్రం 4 గంటలకు ముబారక్ సెంటర్‌లో ఎమ్మెల్యే కొడాలి నాని ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ పార్టీలో చేరనున్నట్లు ఆబూ తెలిపారు.

విద్యార్థులకు అవగాహన సదస్సు

గుడ్లవల్లేరు: నాణ్యమైన విద్య భరోసాకు ఏపీఎస్‌సీహెచ్ఈ క్వాలిటీ ఎష్యూరెన్స్‌సెల్ చేస్తున్న కృషి అభినందనీయం అని ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్ ప్రొఫెసర్ కె.రామ్మోహన రావు అన్నారు. శనివారం గుడ్లవల్లేరు ఇంజినీరింగ్ కళాశాలలో యువత సాధికారిత సాధించేందుకు ఉన్నత విద్యలో వచ్చిన సంస్కరణలు అనే అంశంపై ప్రసంగించారు. ఏపీఎస్‌సీహెచ్ఈ క్వాలిటీ సెల్ సాధించిన కృషి అభివృద్ధిని విద్యార్థులకు వివరించారు. నైపుణ్యమైన విద్యకు ఇది భరోసా అన్నారు. అనంతరం కళాశాల యాజమాన్యం రామ్మోహనరావును ఘనంగా సత్కరించారు.

పరీక్ష సామగ్రి పంపిణీ

తోట్లవల్లూరు: టెన్త్ విద్యార్థులు బాగా చదువుకుని ఉత్తమ ఫలితాలు సాధించాలని చినపులిపాక సర్పంచ్ ఆరేపల్లి శివరామకృష్ణ సూచించారు. బొడ్డపాడు గ్రామానికి చెందిన పతం రామకృష్ణ(చిన్ను), సన్నాల ప్రసాద్ ఆధ్వర్యంలో వల్లూరుపాలెం, తోట్లవల్లూరు, కంకిపాడు మండలం పొద్దుటూరు జెడ్పీ పాఠశాలల్లోని 200 మంది పదో తరగతి విద్యార్థులకు రూ. 18 వేల విలువైన పరీక్ష సామగ్రిని శనివారం పంపిణీ చేశారు. గోపిశెట్టి ఫణికుమార్, నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

పాఠశాలకు బోధనా సామగ్రి అందజేత

ముదినేపల్లి రూరల్: మండలంలోని పెదపాలపర్రు జెడ్పీహైస్కూల్‌కు పూర్వ విద్యార్థులు శనివారం బోధనా సామగ్రిని అందజేశారు. ఈ పాఠశాలకు చెందిన 1987వ సంవత్సరం పదో తరగతి విద్యార్థులు గోల్డెన్ ఫ్రెండ్స్ పేరుతో వీటిని అందించారు.

బొప్పన బాబురావు చారిటీస్ తరఫున బొప్పన అచ్యుతరావు ఈ సామగ్రిని సమకూర్చగా ఆ సంస్థ డైరెక్టర్, పూర్వవిద్యార్థి నాగభూషణం పాఠశాల హెచ్ఎం శాంత కుమారికి అందించారు. అలాగే పదో తరగతి విద్యార్థులకు పరీక్ష సామగ్రిని అందజేశారు. కార్యక్రమంలో స్థానిక సొసైటీ అధ్యక్షుడు బొప్పన ప్రసాద్, ఈదర సీతారామయ్య, బొప్పన శ్రీనివాస్, ఫణిఆనంద్ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

■ **ఆర్‌బీకేల వద్ద సామాజిక తనిఖీ జాబితాలు**

పామర్రు: మండలంలో 2023–24 రబీసాగులో మినుము, ఇతర పంటలు వేసిన రైతుల వివరాలను పంట నమోదు చేసినట్లు మండల వ్యవసాయాధికారి నాగరాణి పేర్కొన్నారు. స్థానిక ఆర్బీకే వద్ద ఏర్పాటు చేసిన సామాజిక తనిఖీ జాబితాను రైతులతో కలిసి ఆమె శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పంట నమోదు చేసిన రైతుల జాబితాలను 'సామాజిక తనిఖీ కోసం మండలంలోని 17 రైతు భరోసా కేంద్రాల వద్ద ప్రదర్శించినట్లు పేర్కొన్నారు. రైతులు తమ వివరాలను సరి చూసుకుని, ఏమైనా అభ్యంతరాలు ఉంటే సంబంధిత ఆర్‌బీకేలలోని వీఏఏలకు తెలిపి సరి చేయించుకోవాలన్నారు.

■ **ఈ–పంట జాబితా ప్రదర్శించండి**

కైకలూరు: రైతు భరోసా కేంద్రాల్లో ఈ – క్రాప్ డ్రాఫ్ట్ జాబితాను ప్రదర్శించాలని జిల్లా వ్యవసాయాధికారి షేక్ హబీబ్ బాషా చెప్పారు. ఇటీవల జిల్లా అధికారిగా బాధ్యతలు చేపట్టిన ఆయన కైకలూరు వ్యవసాయ సహాయ సంచాలకుల కార్యాలయం, లాబొరేటరీని శనివారం సందర్శించారు. స్థానిక వ్యవసాయశాఖ ఏడీ ఆర్.గంగాధరరావు ఆధ్వర్యంలో ఏడీ కార్యాలయంలో కైకలూరు, కలిదిండి మండలాల వ్యవసాయాధికారులు, వ్యవసాయ సహాయకులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు.

■ **సృజనాత్మకతను అలవర్చుకోవాలి**

కైకలూరు: విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచి సృజనాత్మకత శక్తిని అలవర్చుకోవాలని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) పేర్కొన్నారు. కైకలూరులో శనివారం నేషనల్ స్కూల్ గ్రౌండ్స్‌లో జరిగిన 30వ వార్షికోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. స్కూల్ కరస్పాండెంట్ గురజాడ చంద్రమోహన్ ఎమ్మెల్యే దంపతులను స్టేజీపైకి ఆహ్వానించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి ఏటా ఉత్తమ ఫలితాలను సాధిస్తున్న నేషనల్ స్కూల్ ఇదే ఒరవడి కొనసాగించాలన్నారు.

■ **రైతుల నుంచి అభ్యంతరాలు ఉంటే స్వీకరించాలి**

మండవల్లి: రబీలో ఈ క్రాప్ నమోదు, ఈకేవైసీ పూర్తయిన జాబితాలను ఆర్‌బీకేలలో ప్రదర్శించడం జరిగిందని, గ్రామ సభలు నిర్వహించి ఏవైనా అభ్యంతరాలు ఉంటే లిఖితపూర్వకంగా రైతుల నుంచి స్వీకరించాలని వీఏఏలను జిల్లా వ్యవసాయాధికారి హబీబ్ బాషా ఆదేశించారు. మండవల్లి, ముదినేపల్లి మండలాల వ్యవసాయశాఖ సిబ్బందికి స్థానిక సబ్‌డివిజన్ కార్యాలయంలో శనివారం ఆయన సమావేశం నిర్వహించారు.

■ **విద్యార్థులకు ఐరన్ ట్యాబ్లెట్ల పంపిణీ**

మండవల్లి: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు శనివారం ఐరన్ ట్యాబ్లెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ఝాన్సీ, వైఎస్సార్ సీపీ నాయకుడు మెండా సురేష్, హెచ్ఎం ప్రసాద్, ఏఎన్ఎం, ఆశావర్కర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

■ **పింఛన్ల పంపిణీ**

పామర్రు: సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమం శనివారం జోరుగా సాగింది. మండలంలోని పెన్షన్ లబ్ధిదారులైన వృద్ధులు, వికలాంగులు, వితంతువులకు పెన్షన్ వలంటీర్లు అందిస్తున్నారు.

ఘనంగా గంగానమ్మ తల్లి జాతర

నేటితో ముగియనున్న ఉత్సవాలు

పామర్రు: స్థానిక గంగానమ్మతల్లి ఆలయ జాతర శనివారం ఘనంగా నిర్వహించారు. వారం రోజులుగా జరుగుతున్న ఉత్సవాలు ఆదివారంతో ముగియనున్నాయి. అమ్మవారిని స్థానిక అరండాల్‌పేట, కోటిరెడ్డి పేట, చౌదరి పేట, గాంధీనగరం, విజయవాడ రోడ్డు, మూలమలుపులు తదితర ప్రాంతాల్లో ఘనంగా ఊరేగింపు నిర్వహించారు. గ్రామస్తులు అమ్మవారికి చద్ది నివేదనలను సమర్పించి పసుపు కుంకుమలతో పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు బొమ్మారెడ్డి వెంకట రామిరెడ్డి మాట్లాడుతూ ఆదివారం ఆలయం వద్దకు వచ్చే భక్తులకు ఏవిధమైన అసౌకర్యం కలుగకుండా తగు విధమైన చర్యలు తీసుకున్నామన్నారు. ఆలయం వద్ద భక్తుల రద్దీని క్రమబద్ధీకరించేందుకు పోలీస్‌శాఖ వారి సహకారాన్ని కూడా కోరామన్నారు. ఆలయ కమిటీ సభ్యులు నందిపాటి బాలసుబ్రమణ్యేశ్వరరెడ్డి, డి.బాల వెంకటేశ్వరెడ్డి, బి.రాజేష్‌రెడ్డి, గుజవర్తి చంద్రశేఖర్‌రెడ్డి, ఎం.అంజిరెడ్డి, భీమవరపు శ్రీనివాసరెడ్డి, సరిపల్లి రాజశేఖర్‌రెడ్డి, మున్నంగి వెంకటరెడ్డి, దేవిరెడ్డి బాల వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే రాక

తోట్లవల్లూరు: పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ ఆదివారం తోట్లవల్లూరు మండలంలో పర్యటిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కళ్లం వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. ఐలూరులోని శ్రీగంగా పార్వతీ సమేత రామేశ్వరస్వామి ఆలయంలో శివరాత్రి ఏర్పాట్లపై మధ్యాహ్నం రెండు గంటలకు జరిగే సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొంటారని పేర్కొన్నారు. భద్రిరాజుపాలెం పీఏసీఎస్‌లో మూడు గంటలకు డివిడెండ్ల పంపిణీ, తోట్లవల్లూరులో నాలుగు గంటలకు నార్తువల్లూరు పీఏసీఎస్ కార్యాలయ నూతన భవన ప్రారంభోత్సవంలో కేడీసీసీ బ్యాంక్ చైర్‌పర్సన్ తాతినేని పద్మావతితో కలిసి పాల్గొంటారని తెలిపారు.

ట్రాఫిక్ భద్రత పాటించాలి

గుడివాడ టౌన్: రోడ్డు ప్రమాదాలు జరగకుండా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని డీఎస్పీ పి. శ్రీకాంత్ అన్నారు. శనివారం స్థానిక వీకేఆర్, వీఎన్‌బీ అండ్ ఏజీకే ఇంజినీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో రోడ్డు భద్రతా కార్యక్రమాలు నిర్వహించారు. పట్టణంలోని ప్రధాన కూడళ్లలో అవగాహనా కార్యక్రమాలు జరిపారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన డీఎస్పీ శ్రీకాంత్ మాట్లాడుతూ మద్యం తాగి వాహనాలు నడపడం వలన ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయని వాటిని అరికట్టాల్సిన బాధ్యత ప్రతి పౌరునిపై ఉందన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కో–ఆర్డినేటర్, ప్రిన్సిపాల్ ఎస్‌హెచ్‌వీ ప్రసాదరావు, కళాశాల కరస్పాండెంట్ కోదండ రామయ్య, డైరెక్టర్ కల్యాణ్‌కుమార్ పాల్గొన్నారు.